క్లుప్తంగా

కొల్హాపురి మహాలక్ష్మీ దేవికి పట్టువస్త్రాల సమర్పణ



కొల్హాపురి మహాలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో దసరా పండుగను పురస్కరించుకొని విశేష పూజలు చేశారు. అమ్మవారికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు కుటుంబం సమేతంగా పట్టువస్త్రాలు, వడిబియ్యం, పండ్లు, పూలు, గాజులు అందించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, న్యాయవాది రంగనాథ్, వైస్ సర్పంచ్ రవికుమార్, నాయకులు నగేష్‌రంగారెడ్డి, మంజునాథ్, ఈరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర

మడకశిర: మడకశిర మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు 17వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర విజయ దశమి సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. దాదాపు 35 మంది పారిశుధ్య కార్మికులకు ఉచితంగా దుస్తులు అందించారు.కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు మధ్య దరఖాస్తుల స్వీకరణ



ఎక్సైజ్ స్టేషన్ వద్ద భారీ బందోబస్తు చేపట్టిన పోలీసులు

మడకశిర: పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద చివరి రోజు శుక్రవారం మద్యం షాపులకు ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ముందుజాగ్రత్త చర్యగా బందోబస్తు ఏర్పాటు చేసి, దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గంలో మొత్తం 10 మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయి. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గత నాలుగు రోజుల నుంచి కొనసాగింది. మొత్తం 10 మద్యం షాపులకు 140 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ఆయుధ పూజ

అమరాపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ సిద్దేశ్వర సిబ్బంది ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మడకశిరరూరల్: పోలీస్ సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ రాజ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి ఆయుధ పూజ నిర్వహించారు. అంతకుముందు దుకాణాలు, అంగళ్లు, గ్రామాల్లో ఇళ్లల్లో వ్యవసాయ పనిముట్లు తదితర వాటిని శుభ్రం చేశారు.

స్వచ్ఛతా హీ సేవా ప్రచారానికేనా?

- గ్రామాల్లో పారిశుధ్య లోపం
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన గ్రామీణులు
- పట్టించుకోని అధికారులు

రొళ్ల: ప్రభుత్వం స్వచ్ఛాంధ్రప్రదేశ్, 'స్వచ్ఛతా హీ సేవా' పేరుతో ప్రచారం మాత్రమే చేస్తున్నట్లు కనిపిస్తోంది. పల్లె, పట్టణం ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల చిరుజల్లులతో కూడిన వర్షానికి ఎక్కడ చూసిన నీరు నిలిచి అపరిశుభ్రత తాండవిస్తోంది. దీని వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చిగన్ గున్యా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత కారణంగా సాయంత్రం ఆరు గంటలు దాటితే చాలు పట్టణ వాసులతో పాటు గ్రామాల్లో ప్రజలు దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు.

రొళ్ల మండలంలో 10 పంచాయతీలకుగాను అన్ని పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు (యంత్రాలు) ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా పడిఉన్నాయి. దీంతో ఫాగింగ్ గురించి పట్టించుకునేవారులేరు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు దోమల నివారణకు ఒకసారి కూడా ఫాగింగ్ చేయలేదు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడంతోపాటు దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు, డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి అపరిశుభ్రత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బీజీ హళ్లిలో ప్రధాన రోడ్డులో ప్రవహిస్తున్న మురుగు



రొళ్ల ఎస్సీ కాలనీ వెనుక భాగాన డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్త చెదారం

స్వచ్ఛందంగా ఇలా చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు...

- ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- వేడి చెల్లార్చిన తరువాతే నీళ్ల తాగాలి
- మాంసాహారానికి దూరంగా ఉండడం మంచిది
- రోడ్డు సైడులలో దొరికే ఆహారం తినడం మంచిది కాదు
- వారానికి ఒకసారి ఇళ్లల్లో నీళ్లంతా ఖాళీ చేసి డ్రైడే పాటించాలి
- సంపులు, ట్యాంకులు శుభ్రంగా ఉంచుకోవాలి
- స్టోర్ రూములను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి
- దోమలు ఆవాసంగా మారే పాత సామగ్రి, పాత టైర్లు, పాడైన చెప్పులు, చెత్తకుండీలను ఉంచరాదు
- ఇంటి ముందు కాల్వల్లో చెత్తను తొలగించి నీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు పడాలి.

మండల సమాచారం..

- పంచాయతీలు: 10
- వార్డులు: 87
- జనాభా: 41,680 మంది (స్త్రీ, పురుషులు)
- ఫాగింగ్ యంత్రాలు: 10
- పని చేయని ఫాగింగ్ యంత్రాలు: 10
- ప్రస్తుతం ప్రజారోగ్యం: వ్యాధులు ప్రబలుతున్నాయి
- అధికారుల చర్యలు: నిల్

డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



ప్రధాన రోడ్డు పక్కన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి, దుర్వాసన వెదజల్లుతోంది. సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు కానీ పక్కనే డ్రైనేజీ ఏర్పాటు చేయలేదు. దీంతో పైభాగం నుంచి వచ్చే వర్షాపు నీళ్లు, కొళాయిల నీరు సైతం రోడ్డు మధ్యలోనే నిలిచిపోతోంది. దీంతో పాదాచారులు వెళ్లడానికి సైతం ఇబ్బంది పడుతున్నారు. – నాగరాజు, టీడీ పల్లి గ్రామం, రొళ్ల మండలం

మేమే శుభ్రం చేసుకుంటున్నాం



డ్రైనేజీలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. మేమే మురుగు కాలువలను శుభ్రంచేసుకుంటున్నాం. డ్రైనేజీలో మురికి నీళ్లు నిల్వ ఉండడం వల్ల రాత్రి వేళల్లో దోమల బెడద భరించలేక పోతున్నాం. గాలి కాలం కావడంతో రోగాలు కూడా వ్యాపిస్తున్నాయి. – మంజునాథ్, బీజీ హళ్లి గ్రామం, రొళ్ల మండలం

రోగాలు రాకుండా చూడాలి



గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టక పోవడంతో చెత్తా చెదారం పేరుకు పోయింది. గుడ్డగుర్కి పంచాయతీ పరిధిలోని దాసప్పపాళ్యం గ్రామంలో సంపద తయారీ కేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలి. అయితే ఇంత వరకూ గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించలేదు. ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోడవంతో రోగాలు కూడా వ్యాపించే అవకాశం ఉంది. – నరసింహమూర్తి, గొట్టుగుర్కి గ్రామం, రొళ్ల మండలం

శమీ వృక్ష పూజలకు ఏర్పాట్లు పూర్తి

పావగడ: స్థానిక గురు భవన్ మైదానంలో విజయ దశమిని పురస్కరించుకుని శనివారం నిర్వహించే శమీ వృక్ష పూజలకు ఏర్పాట్లు పూర్తయినట్లు శమీ వృక్ష అభివృద్ధి సమితి కార్యదర్శి సత్య లోకేశ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల మధ్య ఎలాంటి తొక్కిసలాట జరగకుండా శమీవృక్ష కట్ట చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులకు ప్రసాద వినియోగం నిర్వహిస్తామన్నారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో శమీ పూజ నేపథ్యంలో వేణుగోపాల స్వామి ఆలయం నుంచి తహసీల్దార్ వరదరాజును అధికారికంగా మైసూరు పేట, పట్టు వస్త్రాలతో అలంకరించి, మేళ తాళాలతో ఊరేగింపుగా పిలుచుకు వస్తారు. చౌడమ్మ, మారెమ్మ, కన్యకా పరమేశ్వరి, శని మహాత్మ, యోగి నారాయణ స్వామి దేవుళ్లను అలంకరించిన బండిలో ఊరేగింపుగా శమి వృక్ష కట్ట వద్దకు తరలిస్తారు. అనంతరం తహసీల్దార్ వరదరాజు శమీ వృక్షానికి పూజలు నిర్వహిస్తారు.

ముగిసిన శరన్నవరాత్రులు

దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 3 న ప్రారంభమైన శరన్నవరాత్రుల వేడుకలు శుక్రవారం ముగిశాయి. స్థానిక శనిమహాత్మ దేవాలయం, కాళికా దేవస్థానం, అభయ సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయం తదితర ఇతర ఆలయాలలో నిర్వహించిన వివిధ అలంకరణలతో దుర్గాదేవి పూజలు 9 రోజుల పాటు ఘనంగా జరిగాయి. స్థానిక కాళికాదేవి ఆలయంలో తుది రోజు శుక్రవారం కాళికాదేవి భద్రకాళి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అధిక సంఖ్యలో భక్తులు భద్రకాళిని దర్శించుకుని ఘనంగా పూజలు నిర్వహించారు.



భద్రకాళి అవతారంలో కాళికాదేవి

రంగారెడ్డి ఉన్నతస్థానాలు అధిరోహించాలి

పెనుకొండ: ఏపీ హైకోర్ట్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, రొద్దం నివాసి రంగారెడ్డి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఏజీపీ భాస్కర రెడ్డి, మాజీ ఏపీపీ నాగరాజు, ఆసిఫ్, చంద్రశేఖరరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, వాల్మీకి శ్రీనివాస్, విశ్వనాథ్‌నాయక్ తదితరులు పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో హైకోర్ట్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన రంగారెడ్డిని స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రంగారెడ్డి బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక కావడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. యువ న్యాయవాదులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. న్యాయవాదులు నాగార్జున, సుదర్శన రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

నియోజకవర్గ వ్యాప్తంగా వర్షం

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం రాత్రి వర్షాలు కురిశాయి. అమరాపురం,రొళ్ల మండలాల్లో భారీ వర్షం కురిసింది.అమరాపురం మండలంలో 65.4,రొళ్ల మండలంలో 60.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. అదేవిధంగా గుడిబండ మండలంలో 41, మడకశిర మండలంలో 15.2, అగళి మండలంలో 6.6 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రొళ్ల,అమరాపురం మండలాల్లో పలు చెరువులకు నీరు చేరినట్లు రైతులు తెలిపారు. చెక్ డ్యాంలు, కుంటలు నిండాయి. వంకలు ,వాగులు ప్రవహించాయి.

వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ పంట

మడకశిరరూరల్: మండలంలో ఐదు మూడు రోజుల నుంచి మోస్తరు వర్షం పడుతుండడంతో రైతులు తొలగించిన వేరుశనగ పంట పొలంలోనే వర్షానికి తడిసి పశుగ్రాసం కూడా అందక కుళ్లిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి మడకశిర మండలంలో 15.2 ఎంఎం, అగళి 6.6 ఎంఎం,రొళ్ల 60.4 ఎంఎం, అమరాపురం 65.4 ఎంఎం, గుడిబండ 41 ఎంఎం వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మోస్తరు వర్షం పడుతుండడంతో తొలగించిన వేరుశనగ పంట పొలంలోనే తడిసి పోతుండడంతో పశు గ్రాసం కూడా దక్కక పోతుందని రైతులు వాపోయారు.

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

అమరాపురం: మండలంలో గురువారం రాత్రి భారీ వర్షానికి వంకలు, వాగులు పొంగిపార్లాయి. అమరాపురం, కె.శివరం, హేమావతి చెరువులకు నీరు చేరాయి. కె.శివరం గ్రామానికి చెందిన రంగప్ప ఇంట్లోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితుడు తెలిపారు. కల్వర్టు చిన్నగా ఉండడంతో నీరు ఇంట్లోకి వచ్చిందని, రాత్రంతా జాగరణ చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఎంపీపై మంత్రి వర్గీయుల గుర్రు !

- పోటాపోటీగా మద్యం టెండర్లు
- ఎంపీ తీరుతో రూ.2 కోట్లు నష్టం వాటిల్లిందని ఆవేదన

పెనుకొండ: మద్యం టెండర్ల విషయంలో ఎంపీ బీకే పార్థసారథిపై మంత్రి సవిత వర్గీయులు గుర్రుమంటున్నారు. టెండర్ల విషయంలో మంత్రి వర్గీయులు షాపునకు ఆరుగురు చొప్పున కేటాయించుకుని టెండర్లు వేసినట్లు తెలిసింది. అయితే ఎంపీ తన వర్గీయుల ద్వారా పోటీగా టెండర్లు వేయించడంతో తమకు దాదాపు రూ.2 కోట్ల దాకా నష్టం వాటిల్లినట్లు మంత్రి వర్గీయులు వాపోతున్నట్లు సమాచారం. ప్రతిపక్షంలో తాము చాలా ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు అధికారంలోకి వచ్చినా ఎంపీ, మంత్రి వర్గపోరుతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని మంత్రి వర్గీయులు చెబుతున్నట్లు సమాచారం. కేవలం మంత్రిని సాకుగా చూపి కొందరు నాయకులు ఓవర్ యాక్షన్ చేస్తున్నారని బీకే వర్గీయులు విమర్శలు గుప్పిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మంత్రి సమీప బంధువు, సోదర సమానుడయిన మాజీ జెడ్పీటీసీ ఒకరు ఎంపీ ఇంటి వద్ద కనిపించడం కొసమెరుపు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

సోమందేపల్లి: మండలంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని నూతన పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మంజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళతామన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, సర్పంచ్‌లు కిష్టప్ప, జీలాన్ ఖాన్, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, నాయకులు నరసింహమూర్తి, ఈశ్వర్ రెడ్డి, ఇమామ్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

వైద్యుల కొరత తీర్చండి

పావగడ: పట్టణంలోని తాలూకా ప్రభుత్వ ఆస్పత్రి లో నెలకొన్న వైద్యుల కొరత వారం లోపు తీర్చాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్థానిక మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప ఆస్పత్రి పాలనాధికారి డాక్టర్ ఎస్ఎల్ బాబును హెచ్చరించారు. ఆయన శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రోగులను పరామర్శించి, ఆస్పత్రిలోని లోటు పాట్లను అడిగి తెలుకున్నారు. పట్టణ జేడీఎస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం తిమ్మరాజు, గోపాల్, గుట్టహళ్లి మణి, భాస్కర నాయక, ధర్మపాల్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రొళ్ల: మండలంలోని జీజీ హట్టి గ్రామంలో సాకమ్మ, పీపన్న దంపతుల కుమార్తె సునీత అనే యువతి ఈనెల 9 నుంచి కనిపించలేదని శుక్రవారం ఫిర్యాదు అందినట్లు ఏఎస్ఐ బాలాజీ తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం షాపులకు 232 దరఖాస్తులు

పెనుకొండ రూరల్: పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 13 దుకాణాలకుగాను 232 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అన్నదాన ప్రసాదానికి విరాళం

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నదాన ప్రసాదానికి లేపాక్షికి చెందిన బెంగళూరులో నివాసం ఉంటున్న ఎస్‌వి.చలపతి కృష్ణ కుమారుడు, ప్రముఖ న్యాయవాది ఎస్‌కేవీ చలపతి శుక్రవారం కమిటీ సభ్యులకు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను సత్కరించారు.

అన్నదానం



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

లేపాక్షి: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షి ఆలయంలో శుక్రవారం దుర్గాదేవి, వీరభద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయం వద్ద పలువురు దాతలు అన్నదానం చేశారు. ఉదయం అభిషేక అర్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



దుకాణదారులతో మాట్లాడుతున్న కియా ఎస్ఐ రాజేష్

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు, హోటళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ రాజేష్ సూచించారు. శుక్రవారం కియా పోలీస్ స్టేషన్ ఆవరణలో దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపుల ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఆపితే జరిమానా విధిస్తామన్నారు. దుకాణాలయ యజమానులు కూడా ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని తెలిపారు.

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శుక్రవారం దుర్గాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ద్విచక్ర వాహనాలు, లారీలు, టిప్పర్లు తదితర వాహనాలు, వ్యాపార సముదాయాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. – సాక్షి బృందం:



లేపాక్షి: మహాచండీ అలంకరణలో కొలువైన దుర్గాదేవి



హిందూపురం: దుర్గాదేవి అలంకరణలో పూజలందుకున్న కన్యకా పరమేశ్వరి



పెనుకొండ మండలం చంద్రగిరిలో రాజరాజేశ్వరిగా మహేశ్వరీ దేవి



మడకశిరరూరల్: మహిషాసుర మర్దిని అలంకరణలో చందకచెర్లు గంగమ్మ తల్లి



అమరాపురం: ఉదుగూరులో కెంచమాంబ దేవిని అలంకరించిన దృశ్యం